# అనుభవ తరంగాలు

శ్రీ కె. సభా

భగవాన్ !

ఎంత బలహీనమైంది నా హృదయం ! అది మాటి మాటికీ అందని అనుభవాలకోసం ఆరాట పడుతుంది అది తప్పని తెలుసుకొన్నదే అందిన అనుభూతుల నట్టే ఉంచు కోవటానికి అనుక్షణం నిన్ను ఆరాధిస్తోంది.

అందని అనుభవాలు నాకు అవసరంలేదు.

అందిన అనుభూతుల నట్టేఉంచితే అవే నన్ను ముందుకు నడిపిస్తాయి.

భగవాన్ !

ఈ నాడు దేశంలో ఒక్కటి మాత్రం బాగా పెరిగింది.

అది కీర్తి దాహం.

ఆ దప్పితో అఖండులే అధః పతితులై పోతున్నారు.

ఆ లాంటి దప్పిక నా కెక్కువగా ఉండేది.

అది సంతృప్తి అనే అమృతంతో తీరిపోతుంది.

ఆ సంతృప్తినే నా హృదయంలో అట్టే ఉంచు.

అప్పుడు నాకా దాహం పుట్టదు, ఆ దాహం పుట్టకుంటే ఉన్న సంతృప్తి భగ్నంకాదు.

భగవాన్ !

ఈ కీర్తి దాహంతోనే గదా ఎన్నో యుద్ధాలు జరిగాయి.

అవునను కొంటాను.

అలెగ్జాండరు, పురుషోత్తముడు అందుకే యుద్ధం చేశారనుకొంటాను. అశోకుడు కూడా కళింగ రణం సల్పిన దందుకే.

ఆ దాహాన్ని గుర్తించిన అశోకుడు సంగ్రామానికి తిలోదకాలిచ్చాడు.

అందుకే కీర్తికాంత అతని మెడలో పూలదండ వేసింది. అదే ననుకొంటాను అసలు రహస్యం

భగవాన్ !

గొప్పవారంటే మొదట నా కర్థం తెలియక పోయింది.

చాల మంది గొప్పవారిని చూశాను. గొప్పవారికి గొప్పవారంటే పట్టదు. గొప్పవారు గొప్పవారిని సమయం వచ్చినపుడు చప్పరించాలని చూస్తుంటారు.

భగవాన్ !

ప్రతి గొప్పవాడూ తన చుట్టూ ఒక కోట కట్టు కొన్నాడు. ఆ కోటను కొందరు కావలి కాస్తున్నారు.

అతని గొప్పతనాన్ని కీర్తించినపుడే అతనికి సంతృప్తి. అది హృదయంలో ఉన్నదని ముఖంలో అద్దంలోవలె ప్రతి ఫలిస్తున్నదని చెప్పినా అతడు వినడు. ఆ పొగడ్తలను చేయగల్గినవాడే ఆ కోటలో తలసాగా వేస్తున్నాడు.

భగవాన్ !

నన్నలాంటి గొప్పవారి నుండి దూరంగా ఉంచు.

నన్నటువంటి గొప్పవానిగా చేయవద్దు.

అసలు అలాంటి గొప్పవాణ్ణి కావాలనే ఆకాంక్ష నాలో ఉదయించ నివ్వకు.

భగవాన్ !

సంస్కృతి అంటే ఏమో అనుకొన్నాను.

అది సమాజాన్ని వంచించే వారు ఉపయోగిస్తున్న పద మని నాకిప్పుడు అనుమానం కలుగుతోంది.

నాగరికత అనే ముసుగులో ఉన్న పశుత్వానికి క్రొత్త నిర్వచనానికి యింత కంటే పదం దొరకలేదేమో? నాకున్న నాగరికతలోనే నన్ను ఉంచు,

నా చుట్టూ పెరిగిన పల్లెటూరి రైతాంగంతో ఉన్న చెలిమిని అలాగే ఉంచు.

వారి అమాయక హృదయాలలో నా కున్న స్థానాన్ని అలాగే ఉంచు.

వారి అనురాగలతలతో నన్ను బంధించు.

భగవాన్ !

ప్రజాసేవ అన్న తురుపుముక్కతో రాజకీయాల పేకాటలు. ప్రజా సేవకు పదవు లవసరమని, నాకిన్నాళ్లూ తెలియదు.

భగవాన్ !

మొన్న మొన్నటి దాకా ఎక్కడో ఒక స్వర్గముందనీ అందులో నువ్వుఉన్నావనీ నీవు పుణ్యాత్ములను ఆద రిస్తావనీ సత్రాలు కట్టించారు. బావులు చెరువులు త్రవ్వించారు. గోపురాళ్లు పాతించారు. చలువ బండలు వేయించారు.

ఇవన్నీ ఎలా చేశారు? ఒక్క విశ్వాసం మాత్రమే ఆధారంగా చేశారు.

కానీ ఈనాడు నేనేదో చేయబోతున్నాను గనుక నాకు నీ ఓటు యివ్వు అంటాడు ఒక నాయకుడు.

భగవాన్ !

ఆ నాయకుడు ప్రభుత్వ బొక్కసంనుండి అంటే ప్రజల సొమ్మునుండి అనగా నీ పైకం నుండి ఏ ఒక మట్టిరోడ్డో వేయించి, ఏ వాగుకో ఒక కట్ట కట్టించి ఈ పని నేను చేశాను కనుక నీ ఓటు నాకే అంటున్నాడు.

భగవాన్ !

విశ్వాసం చచ్చిపోయింది. ఆ నాటి విశ్వాసాన్ని బ్రతికించు. ఆ నాటి త్యాగాన్ని వెలిగించు.

భగవాన్ !

ఇవన్నీ ఎందుకు వ్రాశానంటావు? ఉండ బట్టలేక.

నీకు చెప్పుకోడంలో సంతృప్తి ఉంది.

అమ్మకు బిడ్డ ఆవేదన. తండ్రికి పుత్రుని కోరికలు.

భగవాన్ !

మానవత్వాన్ని మార్చడం నీచేతనే ఔతుంది.

ఎంత పెద్ద కోరిక అది. ఈ కోరిక కోరడంలో నా స్వార్థం ఉంది.

అప్పుడు ఆవేదన లేకుండా చల్లగా ఉంటానని అనుకొంటాను.

భగవాన్ !

మొన్న సరిహద్దు కోసం సత్యాగ్రహం చేశారు ఒకప్పుడు నాకూ సరిహద్దులు సరిగ్గా గీయించాల ఉండేది.

భగవాన్ !

ఎక్కడి కెక్కడ సరిహద్దు ! నీవు అనుకుంటే భూగోళమే మారి పోతుంది.

ఎవరి నేల యిది?

ఎవరి తోటలివి?

ఇది నాది ఇది నీది అనుకుంటున్నారు.

అక్కడికి నయం :

ఖచ్చితంగా కోసిపెట్టాలంటారు :

ఒక తల్లి గడ్డలో నలుగురు పిల్లలూ బ్రతకాలిగా !

తలోవైపు ఆడుకోరాదూ !

ఎంత పేచీ యిది !

ఇది కూడా ఎందుకు?

ఒక్క కీర్తి దాహం....

భగవాన్ !

నా తల్లి గడ్డమీద తగవులు పెంచవద్దు

భగవాన్ !

నా పరిసరాలను విద్వేషంలో ముంచవద్దు.

భగవాన్ !

ఎప్పుడూ ఎక్కడా శాంతి సుఖం కన్పించేలా చెయ్యవూ !

నేను పిచ్చివాణ్నేమో !

కాకుంటే ఎంత గొప్ప వర మడుగుతున్నాను !

ఆ వరం ఇవ్వవూ !

ఇవ్వాలి భగవాన్ !

ఇవ్వాలి !